క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత



వాజేడు: పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి బాధితులకు అందించినట్లు వాజేడు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడుకు చెందిన బీరబోయిన రమేష్, చింతూరుకు చెందిన ఇరుప నాగమణి వారి ఫోన్లను పోడగొట్టుకున్నారు. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి ఫోన్లను గుర్తించినట్లు తెలిపారు. ఫోన్లను శుక్రవారం వారికి పోలీస్‌స్టేషన్‌లో అందించినట్లు ఎస్సై తెలిపారు.

సాయిచంద్ మృతి తీరని లోటు



ములుగు: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, కళాకారులు సాయిచంద్ చిత్రపటానికి ములుగు సాంస్కృతిక కళాసారథులు శుక్రవారం నివాళులర్పించారు. సాయిచంద్ మృతి తెలంగాణ కళారంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి జిల్లా అధ్యక్షుడు దారా దేవేందర్, మార్త రవి, మహ్మద్ రహీమొద్దీన్, అమ్మపాట తిరుపతి, పోరిక శ్యామెల్ నాయక్, చుంచు రాజేందర్, యాకయ్య, అర్జున్, భూక్యా రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన బుర్రి సమ్మయ్య మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవిందనాయక్ శుక్రవారం పరామర్శించి సమ్మయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు భూక్య మురళి, గద్దల శంకర్, ప్రభాకర్, రమేష్, రాజాబాబు, శ్రీను, సుధాకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహ్మద్ అఫిఫా తండ్రి చనిపోయాడు. దీంతో పేదరికం అడ్డుకావడంతో విద్యార్థిని దత్తత తీసుకొని 10వ తరగతి వరకు కావల్సిన ఆర్థికసాయం చేస్తానని ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుడేలి రాజయ్య ఈ సందర్భంగా తెలిపాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కాటారం: మండలంలోని దంతలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా పలు రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై పలు సూచనలు అందించారు. వైద్యులు శ్రీనివాస్, సుజాత, ప్రధానోపాధ్యాయులు నరివెద్ది సత్యనారాయణ, ఉపాధ్యాయులు గోలి సత్యనారాయణ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

మహదేవపూర్: మండలంలోని ఎలికేశ్వరం గ్రామంలో శుక్రవారం గ్రామ శిల (బొడ్రాయి) విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మజీ ఎమ్మెల్యే చందుపట్ల రాంరెడ్డి దేవతలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉత్సవ సమితి సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

వెంకటాపురం(కె): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మచ్చ వెంకటేశ్వరావు అన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వరావు మాట్లాడుతూ.. అర్హులైన దళిత కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలన్నారు. గృహలక్ష్మి పథకానికి రూ.3 లక్షలు సరిపోవని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. బీసీ బంధు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని డిమాండ్ చేశారు. పోడు సాగుదారులకు పోడు పట్టాలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కారం పుల్లయ్య, గ్నానం వాసు, వంక రాములు, కుమ్మరి శ్రీను, రాంబాబు తదితరులున్నారు.



వెంకటాపురం(కె): ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వాజేడు: ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంత సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలను ఇవ్వాలన్నారు. ఇంటి స్థలాలు లేని వారికి ప్రభుత్వ భూమిని ఇవ్వాలన్నారు. గోదావరి వరద మూలంగా ముంపునకు గురయ్యే గ్రామాల వారిని ఎత్తైన చోటుకు తరలించి పక్కా ఇళ్లను కట్టించి ఇవ్వాలన్నారు. దబ్బకట్ల లక్ష్మయ్య, కొప్పుల రఘుపతిరావు, ఎండీ దావూద్, చిట్టిబాబు, దేవయ్య, కృష్ణబాబు, విజయ్, చిన్న, రమాదేవి, చంటి, ముత్తయ్య ఉన్నారు.



వాజేడులో..



వాజేడు: ధర్నా చేస్తున్న నాయకులు

హక్కులపై అవగాహన అవసరం

వాజేడు: పౌరులు హక్కులపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పేరూరు ఎస్సై రుద్రారపు హరీష్ అన్నారు. మండల పరిధిలోని పేరూరులో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరులు తమ హక్కుల ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగంపై అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా చట్టాల గురించి అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఎస్సై హరీష్

నియామకం



నియామక పత్రాన్ని అందిస్తున్న మురళీకృష్ణ

ములుగు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల కన్వీనర్‌గా మండలంలోని పత్తిపల్లి గ్రామానికి చెందిన గుండారపు వైకుంఠంను నియమించినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో వైకుంఠంకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీసీల సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం యూత్ జిల్లా కన్వీనర్ తోటకూరి శ్రీకాంత్, నాయకులు మాచర్ల నాగేశ్వర్‌రావు, మాటూరు ఏడుకొండలు, బక్కి నవీన్, ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులకే నష్టపరిహారం

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో నష్టపోయిన పంటల నష్ట పరిహారం రైతులకు అందించాల్సి ఉండగా, బీఆర్‌ఎస్ నాయకులకు మాత్రమే పరిహారం డబ్బులు అందాయని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో కార్యక్రమంలో ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి అన్నదాతలు పంటలు పండిస్తే అకాల వర్షాలు నట్టేట ముంచాయని, ప్రభుత్వం ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడం లేదన్నారు. నష్ట పరిహారం బీఆర్‌ఎస్ నాయకుల ఖాతాల్లోనే జమ అవుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, ప్రేమ్‌సింగ్, బ్రహ్మాచారి, సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్‌లాల్

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు



మాట్లాడుతున్న బట్ట మురళీకృష్ణ

ములుగు: రైతు బంధు నగదు ఇవ్వకుండా బ్యాంకర్లు ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని జాతీయ బీసీ సంఘం జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ చేసి ఉంటే రైతులకు ప్రస్తుతం ఈ ఘోస ఉండేది కాదని అన్నారు. కష్టపడి పండించిన ధాన్యం డబ్బులు ఇప్పటి వరకు అందించకపోవడంతో పెట్టుబడికి నానా తంటాలు పడుతున్నారని అన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా యూత్ కన్వీనర్ తోటకూరి శ్రీకాంత్, మండల కన్వీనర్ గుండారపు వైకుంఠం, నాయకులు మాంచర్ల నాగేశ్వర్‌రావు, మాటూరి ఏడుకొండలు, బక్కి నవీన్, ముంజాల భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రయోజనకరం



సమావేశంలో మాట్లాడుతున్న అవినాష్

వెంకటాపురం(కె): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పథకాలు ప్రజలకు ప్రయోజనకరమైనవని బీజేపీ మండల విస్తారక్ అవినాష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ గొల్ల కోటి త్రినాథ్‌రావు, మండల విస్తారక్ అవినాష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రజా ఉపయోగ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రెండు సార్లు మోదీ హయాంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రజలు అందరు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు రఘురామ్, లక్ష్మిపతి, సుందర్, ప్రసాద్, దుర్గ, రమేష్, మేరి రత్నం, శ్రీను, నవీన్, సతీష్, రాజశేఖర్, కార్యకర్తలు ఉన్నారు.

పోరాటం తప్ప.. మరో మార్గం లేదు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ లేకుంటే మాదిగలకు మనుగడ లేదని, వ్యక్తి ప్రయోజనాల కన్నా జాతి ప్రయోజనాలు ముఖ్యమని, వర్గీకరణకు పోరాటం తప్ప మరో మార్గం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లాకేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బుట్టు విజయ్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ మాదిగల కళ నేరవేరడం లేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ వర్గీకరణపై హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం కూడా మాదిగలను మోసం చేస్తూనే ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. వర్గీకరణ చేస్తామన్న పార్టీలన్నీ మోసం చేశాయని ఇక పోరాటమే శరణ్యమన్నారు. హైదరాబాద్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయడానికి జిల్లావ్యాప్తంగా మాదిగలు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు గట్ల రాజన్న, అంబాచంద్రమౌళి, గాజుల భిక్షపతి, అంతడుపుల సురేష్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

నిబంధనల ప్రకారమే మైనింగ్ నిర్వహించాలి

వాజేడు: పెసా నిబంధనల ప్రకారమే మైనింగ్ నిర్వహించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజుకు ఆదివాసీ ఐక్య వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న క్వారీలను వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనింగ్ నిర్వహణను ఇసుక సొసైటీ సభ్యులకు, సంఘాలకు తెలియకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. పెసా నిబంధనలను పాటిస్తే ఆదివాసీలకు లబ్ధి చేకూరుతుందని అలా కాకుండా అక్రమార్కుల కొమ్ముకాస్తు వారికి అండగా అధికార పార్టీ నాయకులు, అధికారులు నిలుస్తున్నట్లు ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వాసం నర్సిమూర్తి, చిరంజీవి, మహేష్‌మ బుచ్చయ్య, సాయిచరణ్, మునేశ్వర్ రావు ఉన్నారు.



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి

ఏటూరునాగారం: అర్హులైన ప్రతి ఒక్కరికీ పోడు పట్టాలివ్వాలని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అసెంబ్లీ ఇన్‌చార్జ్ గద్దం భిక్షపతి గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఎం పెల్లి రాజు ఆధ్వర్యంలో పోడు పట్టాలపై నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ.. ఏటూరు నాగారం, మంగపేట, కన్నాయిగూడెం, తాడ్వాయి అటవీ ప్రాంతాలలో ఆదివాసీ, దళిత, పేద బీసీలు అడవినే నమ్ముకొని పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు. తొమ్మిది సంవత్సరాల నుంచి ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వని కేసీఆర్ ఎలక్షన్లు వస్తున్నాయని పోడు పట్టాలు ఇస్తున్నానని మాయమాటలు చెప్పి, వేలల్లో అప్లికేషన్‌లు వస్తే, వందలల్లో పట్టాలు ఇస్తున్నారని ఆరోపించారు. బీఎస్పీ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పోడు రైతుల కోసం ఆందోళన కార్యక్రమాలు చెపడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హరికృష్ణ, రాజు, రామకృష్ణ, పోడు రైతులు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

పేదలకు అందని పోడుపట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న రఘు

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ పోడు పట్టాలు అందించాలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోడు పట్టాల కోసం అప్లికేషన్ పెట్టిన అర్జీదారులలో కనీసం ఐదు శాంతం అర్జీదారులకు కూడా భూమి పట్టాలు అందించలేని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఏం న్యాయం చేస్తోందన్నారు. పోడు భూమి పట్టాల పంపిణీలో ఎస్సీ, బీసీ, మైనార్టీ, బడుగు బలహీన అట్టడుగు వర్గాల పేదలకు కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. పోడు భూములకు అన్ని వర్గాల ప్రజలకు పట్టాలు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున మండల కేంద్రాలలో ధర్నా, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో జిల్లా అసెంబ్లీ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయుబ్ ఖాన్, నర్సింగరావు, ఎల్లయ్య, వంగపండ్ల రవి, సులేమాన్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ములుగు రూరల్: గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన మాచర్ల స్వూర్తి, చెవుగాని ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ మేరకు ఆర్థిక సాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా చెక్కులు మంజూరైయ్యాయి. దీంతో లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ చెక్కులను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్, నాగలక్ష్మ అనిల్, ఉమాదేవి నరేందర్‌రెడ్డి, హరిప్రసాద్, శ్రీకాంత్, శ్రీను, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న నాయకులు

అటవీశాఖ అధికారుల దాడులు నిలిపేయాలి

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ పరిధిలోని 1099, 1990 సర్వే నంబర్‌లలో నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న భూములపై అటవీశాఖ అధికారులు దాడులు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రత్నం రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజులకు రైతులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములు అటవీశాఖకు చెందినవి అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాస్తులో ఉన్న పేదలందరికి అటవీహక్కు చట్టం కింద హక్కుపత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భద్రయ్య, రైతులు ముత్తయ్య, శంకర్, సుధాకర్, మొగిలి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



ఇబ్బంది పడుతున్న వాహనదారులు



పైపులు వేసి పైన పోస్తున్న మట్టి

వాజేడు: మండల పరిధిలోని కొంగాల వాగు సమీపంలో కొత్తగా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టారు. వర్షాలు రాక ముందు మొదలు పెట్టాల్సిన పనులను వర్షాకాలం మీదకు వచ్చిన తర్వాత ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొంగాల వాగుకు అడ్డంగా మట్టి పోసి డైవర్షన్ ఇచ్చారు. గురువారం రాత్రి కురిసిన వర్షాలకు డైవర్షన్ కొట్టుకుపోయింది. గుమ్మడిదొడ్డి మీదుగా వస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో పనులు నిర్వహిస్తున్న వారు తాత్కాలికంగా పాత పైపులు వేసి పైన మట్టి పోసి దానిపై సిమెంట్ వేశారు. మరోమారు గట్టి వర్షం పడితే ఇప్పుడు వేసిన పైపులు కూడా కొట్టుకుపొయ్యే అవకాశం ఉంది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వెంకటాపురం(కె): వాహనం తనిఖీ చేస్తున్న సీఐ శివప్రసాద్



ఏటూరునాగారం: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

వెంకటాపురం(కె): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని సీఐ శివప్రసాద్ అన్నారు. మండలంలోని రామాంజపురం క్రాస్‌రోడ్డు వద్ద సీఐ శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు కార్లు ఇతర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కారులు, బైక్‌లను తనిఖీ చేస్తూ వారి వివరాలను సేకరించారు. సీటు బెల్టు పెట్టుకోవాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

పార్టీ వీడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు

ఏటూరునాగారం: బీఆర్‌ఎస్ పార్టీలో సరైన గుర్తింపు లేక పార్టీని వీడిపోతున్నట్లు బీఆర్‌ఎస్ మండల నాయకుడు లక్ష్మీనారాయణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. 2013లో దివంగత పొలిట్‌బ్యూరో సభ్యుడు అజ్మీరా చందూలాల్ సమక్షంలో పార్టీలో చేరారు. పద్మశాలి సంఘం, రామాలయం, బోనాలు, బతుకమ్మ, గ్రామంలో జరిగే ప్రతి ఉత్సవాలలో తనదైన శైలిలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేస్తుంటాడు. 12 సంవత్సరాలు రామాలయం ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేసి అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. ప్రజాక్షేత్రంలో ఉన్న తనకు ఎలాంటి ఆదరణలేకపోవడంతోనే పార్టీ నుంచి విడిపోతున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ గూటికి ?

బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సరైన గుర్తింపు ఇవ్వకపోవడంతో పోగుల లక్ష్మీనారాయణ కాంగ్రెస్‌లోకి చేరుతున్నట్లు సమాచారం. ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కూడా సంప్రదింపులు చేసినట్లు తెలుస్తోంది.